నిమ్స్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న శైలజను పరామర్శిస్తున్న మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

## వెంటిలేటర్‌పైనే గురుకుల విద్యార్థిని

- గురుకుల విద్యార్థిని శైలజ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ మధుసూదనాచారి పరామర్శ

ఖైరతాబాద్, నవంబర్ 11: ఫుడ్‌పాయిజన్‌కు గురై తీవ్రమైన శ్వాసకోస సమస్యతో బాధపడుతున్న ఓ విద్యార్థినికి నిమ్స్ వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న మహాలక్ష్మి, కే జ్యోతి, సీ శైలజ ఫుడ్‌పాయిజన్‌కు గురి కావడంతో ఈ నెల 3న నిమ్స్ దవాఖానలో చేర్చారు. వీరిలో మహాలక్ష్మి కోలుకోగా, జ్యోతికి పలుమార్లు డయాలసిస్ చేశారు. ప్రస్తుతం కోలుకుంటున్న ఆమెను రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు.కానీ.. శైలజ పరిస్థితి రోజుకోవిధంగా మారుతున్నది. ఆమెకు ఊపిరితిత్తుల సమస్యతో పాటు క్రియాటిన్ పెరిగడంతో ఈ నెల 5న ఐసీయూలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. సోమవారం దవాఖానకు వచ్చిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి శైలజ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిమ్స్‌లో గురుకుల విద్యార్థినులు, వారి కుటుంబసభ్యులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూడా పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని డైరెక్టర్ డాక్టర్ బీరప్పను ఆదేశించారు.

## నిర్లక్ష్యం ఎవరిది రేవంత్?

- ముఖ్యమంత్రిగా 11 నెలల్లో పాలమూరుకు చేసిందేంది?
- అంబలి కేంద్రాల పాలమూరును అన్నపూర్ణగా చేసిన చరిత్ర కేసీఆర్‌ది
- గాలికి వదిలేసిన చరిత్ర నీది
- కృష్ణా నీళ్లు సముద్రం పాలవుతున్నా కండ్లప్పగించి చూస్తున్నవ్
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): కృష్ణా నీళ్లు సముద్రం పాలవుతుంటే కండ్లప్పగించి చూడటం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నదేమిటని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. 'అంబలి కేంద్రాలకు నెలవైన పాలమూరును రెండేండ్లలోనే అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్‌ది అయితే.. పాలమూరు బీళ్లను ఎండబెడుతున్న నీచచరిత్ర సీఎం రేవంత్‌రెడ్డిది' అని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనపై పాలమూరు జిల్లా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరంజన్‌రెడ్డి ఖండించారు.కాంగ్రెస్ వందల కేసులు వేసి కుట్రలు చేసినా వాటిని చేధించి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 90 శాతం పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌దని స్పష్టంచేశారు. రూ.200 కోట్లు ఇస్తే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఎలక్ట్రిక్ పనులు ముందుకు సాగుతాయని, దురదృష్టవశాత్తు వాటిని ఇచ్చే తీరిక సీఎంకు లేదని విమర్శించారు. వట్టెం పంప్‌హౌస్ నీట మునిగితే ప్రాజెక్టుల పరిశీలన పేరుతో పర్యటన పెట్టుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ పంప్‌హౌస్ వైపే చూడలేదని, పాలమూరు ఎత్తిపోతల కింద నిర్మించిన రిజర్వాయర్లలో నీళ్లు నింపే అవకాశం ఉన్నా 11 నెలలుగా ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. 11 నెలల పాలనలో రేవంత్‌రెడ్డికి 25 సార్లు ఢిల్లీకి, అనేక సార్లు ఇతర రాష్ట్రాలకు, మూడు సార్లు విదేశాలకు వెళ్లే తీరిక దొరికిందిగాని, పాలమూరు ప్రాజెక్టుల గురించి చర్చించే సమయం లేదా ? అని ప్రశ్నించారు.

### పెండింగ్ పనులు పూర్తిచేసిన ఘతన కేసీఆర్‌ది

దశాబ్దాలుగా పడావుపడ్డ పనులను పూర్తిచేసిన ఘనత కేసీఆర్‌ది అని, పాలమూరు జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి కల్వకుర్తి ఎత్తిపోతల పనులు పూర్తిచేసి 3.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చారని నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. రాజీవ్ భీమా కింద 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు, నెట్టెంపాడు కింద 1.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు, ఆర్డీఎస్ తుమ్మిళ్ల ఎత్తిపోతల కింద 87 వేల ఎకరాల ఆయకట్టుకు, కోయిల్‌సాగర్ కింద 38 వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీళ్లిచ్చారని వివరించారు. దశాబ్దాల పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి 10 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరందించిన చరిత్ర కేసీఆర్‌ది అని ఉదహరించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పాలమూరు రంగారెడ్డిని పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో 90 శాతం పనులు పూర్తి చేశారని వివరించారు.కాంగ్రెస్ 11 నెలల పాలనలో ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. పాలమూరు జిల్లాలో 5 ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాలలు, అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాల, మత్స్య కళాశాల, వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాల, వందల సంఖ్యలో గురుకుల పాఠశాలలను కేసీఆర్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఇన్ని పనులు చేసిన కేసీఆర్ పాలనలో నిర్లక్ష్యం ఎక్కడ కనిపించిందని ప్రశ్నించారు.

## బీజేపీ ముందు మోకరిల్లిన పొంగులేటి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఈడీ దాడుల నుంచి విముక్తి కోసం బీజేపీ ముందు మోకరిల్లిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల పొం గులేటి ఇంటిపై ఈడీ దాడులు చేసినప్పుడు ఏ హోటల్‌లో ఎవరి కాళ్లు పట్టుకుంటే వదిలేశారో గుర్తులేదా? అని ఎక్స్‌లో ఎద్దేవా చేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకాన్ని నడిబజారులో ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై మంత్రులు నిందలేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం, మంత్రులు ఎంత గింజుకున్నా కేటీఆర్ నిరంతరం ప్రజల ముందు వారిని నిలదీస్తూనే ఉంటారని హెచ్చరించారు.

# కాంగ్రెస్ పాలనలో విద్వేషాలే

- ముస్లింలకు తోఫాపై ధోకా
- మూసీ ప్రక్షాళన పేరిట నిరుపేదల 16 వేల ఇండ్లు కూల్చే కుట్రలు
- కేసీఆర్ పదేండ్ల పాలనలోనే మైనార్టీలకు న్యాయం
- మౌలానా అబుల్ కలాం జయంత్యుత్సవాల్లో కేటీఆర్
- మైనార్టీ పిల్లలకు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ

తెలంగాణ భవన్‌లో ముస్లిం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, నోట్ బుక్కులను పంపిణీ చేస్తున్న కేటీఆర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ పాలనలో విద్వేషాలు.. విధ్వంసాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళన పేరిట 16 వేల పేదల ఇండ్లను కూల్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని నిప్పులు చెరిగారు. ఆరు గ్యారెంటీలు ఇస్తామని చెప్పి అన్ని వర్గాలను మోసం చేసినట్టుగానే ఈ ఏడాది రంజాన్‌కు తోఫా ఇవ్వకుండా ముస్లిం మైనార్టీలను దగా చేసిందని విరుచుకుపడ్డారు.సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అబుల్ కలాం జయంత్యుత్సవాలకు కేటీఆర్ హాజరయ్యారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేతలు డాక్టర్ దాసోజు శ్రవణ్, కార్తీక్‌రెడ్డి, సోహైల్‌తో కలిసి సుమారు 500 మంది ముస్లిం విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని తెలంగాణ భవన్‌లో నిర్వహించడం ఆనందంగా ఉన్నదన్నారు. కేసీఆర్ మనిషిని, మనిషిగా మానవత్వంతో చూశారే తప్ప ఏనాడూ ఓట్ల కోసం వెంపర్లాలేడలేదని చెప్పారు. మైనార్టీ పిల్లలకు నాణ్యమైన విద్య నందించేందుకు 200కు పైగా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.

### కేసీఆర్ పాలనలో మైనార్టీలకు ఉన్నత పదవులు

కేసీఆర్ అధికారం చేపట్టిన వెంటనే మహమూద్ అలీకి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చి గౌరవించారని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్, వరంగల్ డిప్యూటీ మేయర్ పదవులను సైతం మైనార్టీ నాయకులకు ఇచ్చి రాజకీయంగా ప్రోత్సహించారని పేర్కొన్నారు. అబుల్ కలాం పేరిట 2,751 మంది మైనార్టీ విద్యార్థులకు రూ. 20 లక్షల చొప్పున సుమారు రూ. 438 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు అందజేశారని వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏటా రూ. 10 వేల కోట్లను మైనార్టీల సంక్షేమానికి ఖర్చుచేసిన ఖ్యాతి కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు.

> 2014లో తెలంగాణ ఆవిర్భవించినప్పుడు హిందూ, ముస్లింల మధ్య అల్లర్లు చెలరేగుతాయని అనుమానాలు వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో గంగా-జమున తెహజీబ్‌ను పాటించి వారి అనుమానాలను పటాపంచలు చేసి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారు.
>
> -కేటీఆర్

### ఎన్నికల హామీలు గాలికొదిలిన సర్కారు

ఎన్నికల ముందు మైనార్టీ డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను కాంగ్రెస్ గాలికొదిలేసి అబద్ధాల పునాదులపై పాలన చేస్తున్నదని కేటీఆర్ విరుచుపడ్డారు. ఆరు నెలల్లో మైనార్టీ గణన చేపట్టి జనాభాకు అనుగుణంగా ఉద్యోగాలిస్తామని చెప్పి ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదని విమర్శించారు. మైనార్టీ సబ్‌ప్లాన్ తెచ్చి బడ్జెట్‌లో రూ. 4 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి మోసం చేసిందని దుయ్యబట్టారు. యువత ఉపాధి కోసం ఏటా వెయ్యికోట్లు ఖర్చుచేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిలో కనీసం లక్ష కూడా ఇవ్వలేదని విమర్శించారు. అబుల్ కలాం పేరిట ఇస్తామన్నా తోఫా-ఏ-తలీమ్‌కు అతీగతీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీజీ చదివిన విద్యార్థులకు రూ. 5 లక్షలు ఇస్తామని చెప్పి రూపాయి కూడా సాయం చేయలేదన్నారు. మౌజమ్‌లు, ఇమామ్‌లకు రూ. 12 వేల గౌరవవేతనం ఇస్తామని చేసిన వాగ్దానానికి విలువే లేకుండా పోయిందని చెప్పారు.

### పండుగలప్పుడు కర్ఫ్యూ పెట్టారు..

కేసీఆర్ పదేండ్ల పాలనలో గంటసేపు కూడా రాష్ట్రంలో కర్ఫ్యూ పెట్టలేదని కేటీఆర్ గర్తుచేశారు. కానీ రేవంత్ సర్కారు మొన్న దసరా, దీపావళి పండుగలప్పుడు కూడా 163 సెక్షన్ పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఎక్కడ? ఈ చిచోరా సీఎం రేవంత్ ఎక్కడ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సలీం, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మసీయుల్లాఖాన్, వరంగల్ డిప్యూటీ మేయర్ మన్సూర్, బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, గజ్జెల్ నగేశ్, ముఠా జైసింహ, అర్షద్, కలీం, ఇంతియాజ్, మసీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపాలనా? ప్రతికారపాలనా?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదెందుకు? ఆ పార్టీ అధిష్ఠానం ఎందుకు పట్టించుకోవడంలేదు?' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా నిలదీశారు. సర్వేలు సరే.. పథకాలేవి, ఉన్నవి ఉంచుతారా? ఊడబీకుతారా? అని ప్రశ్నాస్త్రాలు సంధించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంకొనే నాథుడు లేక రైతన్నలు కన్నీళ్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా ముసుగులో, మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇండ్లు కూల్చుతున్నా, వారు గుండెలవిసేలా రోదిస్తున్నా కాంగ్రెస్ అధిష్ఠానంలో చలనం లేదా? అని ప్రశ్నించారు. ఎకరాకు ఏడాదికి రూ. 15,000 రైతు భరోసా అందకపోవడంతో రైతులు పెట్టుబడి కోసం అప్పులపాలవుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అరకొర రుణమాఫీతో రైతులను అరిగోస పెడుతున్నా, గురుకులాల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో దవాఖానల పాలవుతున్నా ప్రభుత్వం ఎందుకు సమీక్షించడం లేదని ప్రశ్నించారు. ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ. 2,500, అవ్వాతాతలకు రూ. నాలుగు వేల పింఛన్ ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మొత్తంగా ఈ పరిణమాలు చూస్తుంటే రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలనో? ప్రతికార పాలనో? అర్థంకావడం లేదని విమర్శించారు.

> కేసీఆర్ పదేండ్ల పాలనలో గంటసేపు కూడా రాష్ట్రంలో కర్ఫ్యూ పెట్టలేదు. రేవంత్ సర్కారు మొన్న దసరా, దీపావళి పండుగలప్పుడు కూడా 163 సెక్షన్ పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టింది.
>
> -కేటీఆర్

### మాట నిలబెట్టుకున్న కేటీఆర్

ఆర్థిక సమస్యలతో నేతకార్మిక దంపతులు ఆత్మహత్య చేసుకోగా అనాథలైన ముగ్గురు పిల్లలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ముగ్గురు చిన్నారులను ఆదుకుంటానని భరోసా ఇచ్చి.. సోమవారం ముగ్గురు చిన్నారుల పేరిట రూ.2 లక్షల చొప్పున పాల్టీ ఫండ్‌ను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి మాట నిలబెట్టుకున్నారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో నాయకులు వారి నివాసానికి వెళ్లి ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను చిన్నారులకు అందజేశారు. -సిరిసిల్లటౌన్

## అమృత్ టెండర్లలో అవినీతి

మొదటిపేజీ తరువాయి...

బావమరిదికి ఇప్పించుకున్నారని, ఇది ముఖ్యమంత్రి పదవిని దుర్వినియోగం చేయడమే అవుతుందని కేటీఆర్ తెలిపారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాప్రతినిధులు తమ విచక్షణాధికారాలను సొంత కుటుంబ సభ్యుల కోసం వినియోగించడం నేరమని పేర్కొన్నారు. అమృత్ టెండర్ల అక్రమ కేటాయింపుల్లో సీఎం అవినీతికి పాల్పడినట్టుగానే భావించాలన్నారు. దీని ప్రకారం ముఖ్యమంత్రి, వారి కుటుంబ సభ్యులు నేరుగా అవినీతిలో భాగమైనట్టే అవుతుందని చెప్పారు. ఈ టెండర్‌ను అక్రమంగా కుటుంబ సభ్యులకు కట్టబెట్టడం ఆర్టికల్ 191(1) ప్రకారం నేరంగా పరిగణించాలని కోరారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆఫీస్ ఆఫ్‌ప్రాఫిట్ కేసును ఇది పోలి ఉందని వివరించారు. తెలంగాణలోని అమృత్ టెండర్ల అవినీతి కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 9ఏ రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ 1951 కిందకు వస్తుందని గుర్తుచేశారు.

### కేస్ స్టడీలుగా రాబర్ట్ వాద్రా, సిద్ధరామయ్య కేసులు

సీఎం తన బావమరిదికి టెండర్లను కట్టబెట్టడం అధికార దుర్వియోగానికి పాల్పడటం కిందకు వస్తుందని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. గతంలో ఇదే తరహా కేసును సోనియాగాంధీ ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అశోక్ ఖేమ్కా వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యానా-2024 కేసును ఈ టెండర్ల కేటాయింపు పోలి ఉందని చెప్పారు. ఆ కేసులో సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా లబ్ధి పొందినట్టుగానే రేవంత్‌రెడ్డి బావమరిది లబ్ధి పొందారని పేర్కొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై నమోదైన ముడా కేసు కిందకే ఇది కూడా వస్తుందని తెలిపారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కింద బిహారీలాల్ డోబ్రే వర్సెస్ రోషన్‌లాల్ డోబ్రే కేసు-1983, శత్రుచర్ల చంద్రశేఖర్ రాజు వర్సెస్ వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్-2005, జయాబచ్చన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు-2001, దివ్య ప్రకాశ్ వర్సెస్ కుల్తర్‌చంద్ రాణా-2003 వంటి కేసులు దీనికి వర్తిస్తాయని కేటీఆర్ ఉదహరించారు. 1964లో సుప్రీం కోర్టు కూడా ఇలాంటి కేసులు ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కిందకు వస్తాయని తీర్పిచ్చినట్టు తెలిపారు.

## ఏడాదిలోపే ప్రజల తిరుగుబాటు

- పోలీస్ శాఖ సహకారంతో ప్రభుత్వం నడుస్తున్నది
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాది కాకముందే అన్ని రంగాల ప్రజలు తిరగబడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖ సహకారంతో ప్రభుత్వం నడుస్తున్నదని ఆరోపించారు. సోమవారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే బాంబులు వేస్తామంటున్నారని, అసలు రేవంత్ మాటలు సీఎం హోదాను దిగజార్చేలా ఉన్నాయని విమర్శించారు. మూసీకంటే దుర్గంధమైన నోటితో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని దూషిస్తున్నారని దుయ్యబట్టారు. ఏడాదిలోనే ప్రభుత్వం ప్రజలకు పాలన అందించడంలో ఫెయిల్ అయినందుకు సిగ్గుపడాలని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం లేక విద్యార్థులు దవాఖానల పాలవుతుంటే.. మరో పక్క ప్రభుత్వ దవాఖానల్లో మందులు లేక రోగులు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావని తెలిపారు. సాగునీరు లేక, మద్దతు ధర రాక రైతులు రోడ్డెక్కి ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ధాన్యం, పత్తి కొనే దిక్కులేదని, నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ప్రభుత్వం దళారులకు కొమ్ముకాస్తున్నదని విమర్శించారు. దళారుల చేతుల్లో రైతుల దోపిడీకి కారణం మంత్రులేనని, రైతులను దోపిడీ చేస్తున్న సొమ్ము వందల కోట్లు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. వికారాబాద్‌లో ప్రభుత్వ దుర్మార్గాన్ని ఎదిరించి ఆత్మరక్షణకు రైతులు దాడులకు దిగాల్సిన పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వ పరిపాలనకు వికారాబాద్ దాడి ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు.

సూర్యాపేట పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### సీఎం, మంత్రిపై చర్యలు తీసుకోవాలి

- సూర్యాపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

సూర్యాపేట టౌన్, నవంబర్ 11: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు సోమవారం సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి 420 హామీలిచ్చి అమలు చేయడం చేతకాక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు.

## దళితబంధు నిధులడిగితే దాడులా?

- దళిత బిడ్డల కోసం జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధం
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): రెండో విడత దళితబంధు నిధులడిగిన పాపానికి హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితులతోపాటు తనపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ దమనకాండకు భయపడేది లేదని, దళితబంధు లబ్ధిదారులకు న్యాయం జరిగేదాకా సీఎం రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కేసీఆర్ సర్కారు తెచ్చిన ఈ పథకాన్ని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తున్నదని ధ్వజమెత్తారు. మధిర నియోజకవర్గం చింతకానీ మండలంలోని 860 మంది దళితులకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చెక్కులందించారని, మరి హుజూరాబాద్ దళితులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు.

### దళితుల తిరుగుబాటు తప్పదు

'ఈ రోజు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతులు కలెక్టర్‌ను ఉరికించి కొట్టారు. హుజూరాబాద్‌లోని దళితులకు దళితబంధు నిధులివ్వకుంటే ఇదే తీరులో తిరుగుబాటు చేస్తరు. గుర్తుంచుకో రేవంత్‌రెడ్డి' అని కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. దళితబిడ్డల కోసం జైలుకెళ్లేందుకు కూడా సిద్ధమని తేల్చిచెప్పారు. తన పోరాటం పోలీసుల మీద కాదని,రేవంత్‌రెడ్డి మీదేనని స్పష్టం చేశారు.

### నగరంలో పాదయాత్రకు సిద్ధమేనా?

కేటీఆర్ పాదయాత్ర చేస్తానని అనగానే రేవంత్‌రెడ్డి ఆగమేఘాల మీద మూసీ చివరలో ప్రజలులేని చోట పాదయాత్ర చేశారని కౌశిక్‌రెడ్డి ఎద్దేవా చేశారు. దమ్ముంటే తమతో కలిసి హైదరాబాద్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేయాలని సవాలు విసిరారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన రేవంత్‌రెడ్డి దిగజారి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తీరు మార్చుకోకుంటే ఆయన భాషలోనే బదులిస్తామని కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు.

## తిట్లు..ఒట్లు తప్ప చేసిందేం లేదు

- కురుమూర్తి వెంకన్న సాక్షిగా రేవంత్ అబద్ధాలు
- కేసీఆర్ హయాంలోనే పాలమూరుకు నిధుల వరద
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి కురుమూర్తి వేంకటేశ్వర స్వామి సాక్షిగా అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విరుచుకుపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, కొడంగల్ జడ్పీటీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆంజనేయ గౌడ్, డాక్టర్ కురువ విజయ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత మహబూబ్‌నగర్ నుంచి ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం రేవంత్‌రెడ్డికి వచ్చిందని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఈ నాలుగేండ్లలో కేసీఆర్‌కంటే నాలుగింతలు నిధులు ఎక్కువ తెచ్చి అభివృద్ధి చేయాలని సూచించారు. మూడు, నాలుగు నెలల్లో పూర్తయ్యే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో పాలనను గాలికొదిలి కేసీఆర్‌పై తిట్లు, దేవుళ్లపై ఒట్లు పెట్టడం తప్ప రేవంత్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. మహబూబ్‌నగర్ అంధులకాలనీలో 75 మంది ఇండ్లు కూలగొడితే పట్టించుకోకపోగా, బాధితులకు అండగా ఉన్న తన తమ్ముడిపై కేసులు పెట్టించారని మండిపడ్డారు. ఆయన పాలమూరు బిడ్డే అయితే మన్నెంకొండ ఆలయాభివృద్ధికి నిధులివ్వాలని డిమాండ్ చేశారు.

### పాలమూరుకు ఎన్ని నిధులిచ్చినవ్? : ఆల

రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతున్నదని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ సీఎం అయిన మొదటి నెలలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.30 వేల కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. 2,3 నెలల్లో పూర్తిచేసి 10 లక్షల ఎకరాల కు నీరందించే అవకాశమున్న ఈ ప్రాజెక్టును రేవంత్ పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. 11 నెలల్లో పాలమూరుకు ఏం చేశారు? ఎన్ని నిధులిచ్చారో చెప్పాలని నిలదీశారు.

## కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్యాయం

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందే
- బీఆర్ఎ